సాక్షి
పశ్చిమగోదావరి
అదివారం । 10 । మార్చి । 2024



పోషకాహార పక్షోత్సవాలు

యలమంచిలి: పోషకాహార ఆవశ్యకతను తెలియజేసేలా ఈనెల 9 నుంచి 23 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. యలమంచిలిలో మానవహారం చేపట్టారు.



ఘనంగా తెప్పోత్సవం

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వర స్వామి ఆలయ సమీపంలోని కోనేరులో శివరాత్రి వేడుకల్లో భాగంగా తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది.



వరాల వెంకన్నకు పూజలు

అత్తిలి: అత్తిలి మండలం ఈడూరులో వరాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ప్రత్యేక అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు.

టీడీపీలో అసమ్మతి రాగం

పొత్తు ప్రకంపనలు

- తమ్ముళ్లకు చంద్రబాబు షాక్
- జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని సీటు గల్లంతు!
- అదే బాటలో పోలవరం, తాడేపల్లిగూడెం సీట్లు!
- పొత్తు స్థానాల ఇన్‌చార్జులకు బాబు ఫోన్లు
- పోలవరం, తాడేపల్లిగూడెంలో భగ్గుమన్న అసంతృప్తి
- ఉంగుటూరులో పూర్తయిన అసమ్మతి సమావేశం
- భీమవరం, నరసాపురంలో గందరగోళం
- జనసేన అభ్యర్థుల పేర్లతో హడావుడిగా సర్వేలు



సీటు లేదు సారీ అంటూ..

సీటు లేదు సారీ అంటూ వరుస ఫోన్లు టీడీపీ ఇన్‌చార్జులకు వస్తున్నాయి. అధికారికంగా పోలవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం ఇన్‌చార్జులకు రాగా నరసాపురం, భీమవరం ఇన్‌చార్జులకు స్పష్టమైన సంకేతాలు ఇంతకు ముందే ఇచ్చారు. శనివారం తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జి నియోజకవర్గ సమావేశం నిర్వహించి పొత్తులపై ముందే చెబితే బాగుంటుంది, కోట్లు ఖర్చుపెట్టి హడావుడి చేసిన తర్వాత పొత్తు పేరు చెప్పి సీటు గల్లంతు చేయడం సరికాదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే తనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని చెప్పారని ప్రకటించుకున్నారు. ఇక పోలవరానికి సంబంధించి ఎలాంటి హామీ లేకుండా సీటు జనసేనదేనని తేల్చిచెప్పారు. మొత్తం మీద పొత్తు స్థానాలు జనసేన ప్రకటించకుండానే చంద్రబాబు లీక్స్‌తో టీడీపీ శ్రేణులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నాయి. ఉంగుటూరు నియోజకవర్గ టికెట్‌ను తెలుగుదేశం పార్టీకే కేటాయించాలని కోరుతూ ఆదివారం నియోజకవర్గ ముఖ్య నాయకులు చంద్రబాబును కలవనున్నారు. ఈ సీటును జనసేనకు కేటాయించవద్దని చంద్రబాబు దృష్టికి బలంగా తీసుకువెళ్లనున్నారు.

సాక్షి ప్రతినిధి,ఏలూరు: తెలుగుదేశం పార్టీ, జనసేన పొత్తు ప్రకంపనలు ఉమ్మడి పశ్చిమగోదావరిలో కాకరేపాయి. ఏళ్ల తరబడి నుంచి టికెట్ ఆశిస్తూ పని చేస్తున్న ముఖ్య నేతలందరికీ బలంగా హ్యాండ్ ఇచ్చారు. విచిత్రమేమిటంటే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుల సీట్లు కూడా నూరుశాతం గల్లంతవ్వడం విశేషం. అధికారికంగా జనసేన, టీడీపీ సీట్లు ప్రకటించకపోయినా చంద్రబాబు జనసేనకు కేటాయించిన స్థానాల టీడీపీ ఇన్‌చార్జులకు ఫోన్ చేసి జనసేన పార్టీకి పనిచేయండని చెప్పడంతో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. రెండు రోజుల క్రితం ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అసమ్మతి సభ నిర్వహించగా.. శనివారం పోలవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో అసమ్మతి సెగల నడుమ సమావేశాలు వాడీవేడిగా సాగాయి.

వరుస పెట్టి ఫోన్లు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వరుస పెట్టి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జులకు ఫోన్లు చేస్తున్నారు. గత రెండు రోజుల్లో పోలవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం ఇన్‌చార్జులకు ఫోన్లు చేసి 'సారీ' చెప్పగా అంతకు ముందే భీమవరం, నరసాపురం ఇన్‌చార్జులకు పరోక్ష సంకేతాలిచ్చి సీట్లు తమవి కాదని తేల్చారు. దీంతో పాటు నరసాపురంలో పొత్తుల్లో భాగంగా జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్, కొత్తపల్లి సుబ్బారాయుడుల్లో ఎవరైతే బాగుంటుందని సర్వే కూడా మొదలుపెట్టేశారు. అలాగే భీమవరం నుంచి టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పవన్‌కళ్యాణ్‌తో భేటీ అయి జనసేన నుంచి తాను పోటీ చేయనున్నట్లు ప్రకటించేసుకున్నారు. పార్టీలో చేరకుండానే జనసేన కార్యక్రమాలకు ఆయన హాజరవుతున్నారు. ఈ తాజా పరిణామాలతో ఉమ్మడి జిల్లాలో టీడీపీలో గందరగోళం రేగింది.

భగ్గుమంటున్న తమ్ముళ్లు

నామమాత్రపు బలం లేని జనసేనకు ఏలూరు, నరసాపురం పార్లమెంట్ స్థానాల పరిధిలో ఐదు అసెంబ్లీ సీట్లు ఇవ్వడమేంటని, వారి స్థాయి ఎంత, ఓటింగ్ ఎంత, ఆర్థిక బలం లేని వాళ్లను ఎందుకు నెత్తిన పెట్టుకోవాలంటూ టీడీపీ కేడర్ భగ్గుమంటోంది. రెండు రోజులు క్రితం ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులకు ఎటువంటి సమాచారం లేకుండా సీటు గల్లంతు చేశారు. ఎల్లో మీడియా కథనాలు చూసి పార్టీ ముఖ్యులతో సీటు గల్లంతైన విషయాన్ని ధ్రువీకరించుకుని వీరాంజనేయులు హడావుడిగా భీమడోలులో సమావేశం నిర్వహించి తమ సత్తా పార్టీకి తెలియజేయాలని, భారీగా కార్ల ర్యాలీ నిర్వహించి ఉంగుటూరు సీటు జనసేనకు ఇవ్వవద్దని డిమాండ్ చేయాలని నిర్ణయించారు. అయితే చంద్రబాబు నుంచి ఫోన్ రావడంతో గన్ని ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యింది.

అత్యవసర సమావేశాలు

తాజాగా పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జిలకు కూడా చంద్రబాబు నుంచి ఫోన్లు వచ్చాయి. అందరికీ ఫోన్ చేసి 'ఎవరూ పార్టీని తిట్టవద్దు.. నన్ను విమర్శించవద్దు.. పొత్తు ధర్మాన్ని పాటించి జనసేనకు పనిచేయండి' అని చంద్రబాబు చెప్పడంతో టీడీపీ కార్యకర్తల్లో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంటుంది. పార్టీ గీత దాటవద్దంటూనే ఇన్‌చార్జులు పార్టీ నియోజకవర్గ అత్యవసర సమావేశాలు నిర్వహించి వాళ్లు మాట్లాడకుండా కేడర్‌తో పార్టీని తిట్టించటం విశేషం.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



తణుకులో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: సంక్షేమం, అభివృద్ధి పారదర్శకంగా అందాలంటే మరలా మీ బిడ్డ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో పట్టణ పరిధిలో రూ.6.21 కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్డు అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా సంక్షేమం, అభివృద్ధి పనులను పారదర్శకంగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ 58 నెలల పాలనలో రుణమాఫీలతోపాటు అవసరమైన భవన నిర్మాణాలన్నీ పూర్తి చేశామని, ప్రజల దీవెనలతో మరలా తమ ప్రభుత్వం రాగానే మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఏంటో ప్రజలకు చూపిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి పథంలో తణుకును రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

కొమరవరంలో అభివృద్ధి పనులు

తణుకు టౌన్: కొమరవరంలో నాడు–నేడులో నిర్మించిన ప్రాథమిక పాఠశాల, రైతు భరోసా కేంద్రం, సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన గోడౌన్, సీసీ రోడ్లు, డ్రెయిన్లను మంత్రి కారుమూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేయాలన్నా లోటు బడ్జెట్ ఉండేదని లోకేష్ చెబుతున్నారని, అయితే సీఎం జగన్ అదే బడ్జెట్‌తో పేదలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తున్నారన్నారు. విద్యారంగంలో రూ.72 వేల కోట్లు వెచ్చించారన్నారు. అనంతరం ప్రజా దీవెన పాదయాత్ర, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత



భీమవరంలో పోలీసు కవాతులో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ అజిత

భీమవరం: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విధులు సక్రమంగా నిర్వర్తించాలని ప్రత్యేక బలగాలకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ వి.అజిత సూచించారు. భీమవరంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పోలీస్ కవాతులో వారు పాల్గొని మాట్లాడారు. ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా భద్రత కట్టుదిట్టంగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదనపు ఎస్పీలు భీమారావు, ఏటీపీ రవికుమార్, డీఎస్పీలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పర్వాతారోహకుడు దాసుకు వరల్డ్ రికార్డు



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు చేతులమీదుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న దాసు

పెనుగొండ: పర్వతారోహకుడు గోసులమండ దాసు హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పురస్కారం పొందారు. అవార్డు సాధించిన సందర్భంగా శనివారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసి ఆయన చేతులమీదుగా ధ్రువీకరణ పత్రం, మెడల్స్ అందుకున్నారు. దాసు ఇప్పటికే కిలిమంజారో పర్వతం మౌంట్ ఎల్‌బ్రస్ పర్వతం, మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంపు, కాలాపత్ర, నగర్‌సంగ్ పర్వతాలను అధిరోహించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ తాను చిన్ననాటి నుంచి పర్వతారోహణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని, ఇందుకు ఆర్థికంగా మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అండగా నిలిచారన్నారు. ప్రతి పర్వతంపై తాను మనసున్న మారాజు శ్రీరంగనాథరాజు పతాకాన్ని ఎగురవేశానన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బళ్ల రాజశేఖర్‌బాబు, పీతల స్వామి, గోసులమండ రాజు ఉన్నారు.

పట్టిసం ఆదాయం రూ.27 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించినట్టు ఈఓ ఎస్.సంగమేశ్వర వర్మ తెలిపారు. రూ.300 టికెట్ల ద్వారా రూ.4.86 లక్షలు, రూ.50 టికెట్ల ద్వారా రూ.3.90 లక్షలు, రూ.20 టికెట్ల ద్వారా రూ.2.63 లక్షలు, తలనీలాలు టికెట్ల ద్వారా రూ.1,100, హుండీల ద్వారా రూ.12.48 లక్షలు, కొబ్బరి చెక్కల అమ్మకం ద్వారా రూ.1.18 లక్షలు, తలనీలాల ద్వారా రూ.6,600, అన్నదానం విరాళాల రూపంలో రూ.2.74 లక్షలు మొత్తంగా రూ. 27,86,942 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

భీమవరం: జిల్లాలో శనివారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పరీక్షల కన్వీనర్ కె. చంద్రశేఖర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్, ఒకేషనల్ కేటగిరీల్లో 17,590 మంది విద్యార్థులకు 16,962 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.

కమనీయం.. కడు రమణీయం



వేదికపై తిరుమల శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



తిలకిస్తున్న భక్త జనం

నేత్రపర్వంగా తిరుమలేశుని కల్యాణం

తాడేపల్లిగూడెం అర్బన్: దేవదాయ శాఖ నిర్వహణలో ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధర్మప్రచార మహోత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెంలో బలుసులమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద శనివారం రాత్రి తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ధర్మ ప్రచార ఉత్సవాల్లో భాగంగా రెండు నెలలుగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల ఉత్సవమూర్తులకు ఇక్కడ ప్రత్యేక పూజలు, కల్యాణాలు జరిపిస్తున్నారు. దీనిలో భాగంగా తిరుమల శ్రీవారి కల్యాణ్యాన్ని జరిపించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో మాదిరిగా ఇక్కడ ఉదయం నుంచి శ్రీవారి సేవలు, రాత్రి కల్యాణం జరిపించారు. తిరుమల దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు స్వయంగా కళ్యాణ తంతు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు భారీ ఏర్పాట్లు చేశారు. మంత్రి కొట్టు సత్యనారాయణ, సౌదామని కుమారి దంపతులు, కొట్టువిశాల్ దంపతులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులకు అందించారు. కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించిన భక్తులు పరవశించారు.

శోభాయమానంగా రథోత్సవం



భీమవరంలో ఉమాసోమేశ్వరస్వామి రథోత్సవం



పాలకొల్లులో రావణ బ్రహ్మ వాహనంపై గ్రామోత్సవం

భీమవరం(ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ముందుగా స్వామి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి పురవీధుల్లో ఊరేగించారు. విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి ఈవీ సుబ్బరావు, ఈఓ డి.రామకృష్ణంరాజు, ధర్మకర్తలు చెల్లబోయిన సూర్యప్రకాష్, కుర్మదాసు సత్యశ్రీనివాస్, తాణాల రామకృష్ణ, నాచుశ్రీవల్లి, నల్లం రఘుబాబు, సోమాదుల లీలాఈశ్వరీ, లక్కు త్రిమూర్తులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హరోంహర.. శంభో శంకర

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మల్లన్న పాగాను వరదా సోమేశ్వరరావు ఆలయ అర్చకులకు అందించగా ప్రత్యేక పూజలు చేసి ఆలయ శిఖరం నుంచి గాలి గోపురం శిఖరం వరకు పాగాను అలంకరించారు. అనంతరం భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో లక్షపత్రి పూజ చేశారు. శనివారం సాయంత్రం రావణ బ్రహ్మ వాహనంపై పార్వతీ సమేత క్షీరారామలింగేశ్వరస్వామి, లక్ష్మీ జనార్దనస్వామి వార్ల గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. వాహనం ముందు గాదె జనార్దనగుప్త కుటుంబ సభ్యులు కుంభం పోసి నైవేద్యం సమర్పించారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ, అర్చకులు కిష్టప్ప, అనిల్, పూర్ణయ్య, సోమేశ్వరరావు, ట్రస్టీబోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు వెన్నుదన్ను

- నూరుశాతం ఈ–క్రాప్, ఈకేవైసీ పూర్తి
- 1,453 అభ్యంతరాల పరిష్కారం
- 2.20 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు



పాలకోడేరు మండలంలో రైతులతో ఈకేవైసీ చేయిస్తున్న సిబ్బంది

భీమవరం: రాష్ట్రంలో అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా.. వ్యవసాయాన్ని పండగ చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నివిధాలా అండగా ఉంటున్నారు. రైతులకు వెనుదన్నుగా ప్రతి సీజన్‌లో పంట వేసిన వెంటనే ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదు ప్రక్రియలను ప్రభుత్వం చేపడుతోంది. దీని ద్వారా పంటల విక్రయం, విపత్తుల సమయంలో పంట నష్టం, రైతులకు అందిస్తున్న పథకాలను సులభంగా పొందే వీలుంటుంది. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో దాళ్వా వరిపైరు ఏపుగా పెరగడంతో పంట ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.

వరితోపాటు మినుము : పశ్చిమగోదావరి జిల్లాలో 2,20,197 ఎకరాల్లో వరి సాగు చేయగా 1,625 ఎకరాల్లో మినుము, 786 ఎకరాల్లో వేరుశెనగ, 165 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టారు. ఈ మేరకు సుమారు 1.14 లక్షల మందికి ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదు పూర్తిచేశారు. దళారులను నమ్మి పోకుండా ప్రభుత్వం మద్దతు ధరలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించడంతో ఈ–క్రాప్ కీలకంగా ఉంది.

పథకాల అమలుకూ..

రైతులు పండించిన ధాన్యం, ఇతర పంటల విక్రయానికి ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ అవసరం. రైతులు వరి నాట్లు వేసినప్పటి నుంచి వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ఈ–క్రాప్ నమోదు ప్రారంభించగా దాదాపు 2,20,197 ఎకరాల్లో 1,13,734 రైతుల ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదు పూర్తిచేశారు. అలాగే తాడేపల్లిగూడెం ప్రాంతంలో 786 మంది రైతులు 1,625 ఎకరాల్లో మినుము, నరసాపురం, మొగల్తూరు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో 81 మంది రైతులు 72 ఎకరాల్లో వేరుశెనగ, 75 మంది రైతులు 165 ఎకరాల్లో మొక్కజొన్న పంటలను వేయగా వీటికీ ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేశారు. దీనిద్వారా జిల్లాలో ఎన్ని ఎకరాల్లో ఏఏ పంటలు పండిస్తున్నారు, పండించిన పంటలకు మార్కెట్ ఎలా కల్పించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంటుంది. ఈ–క్రాప్ నమోదుతో పంటల విక్రయంతో పాటు పంటల బీమా, రుణాల మంజూరు, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నావడ్డీ వంటివి పొందేందుకు రైతులకు అవకాశం ఉంటుంది. ధాన్యం, ఇతర పంటలను రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా విక్రయించిన వెంటనే రైతులకు అందాల్సిన సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు.

1,453 అభ్యంతరాల పరిశీలన

జిల్లాలో రైతులు వేసిన పంటలకు సంబంధించి ఈ–క్రాప్, ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయా జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. వీటిపై అభ్యంతరాలుంటే తెలపాలంటూ వ్యవసాయశాఖ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 1,453 మంది ఈ–క్రాప్, ఈకేవైసీలో తప్పిదాలను అధికారుల దృష్టికి తీసుకురాగా వాటిని తక్షణం పరిష్కరించారు.

1.14 లక్షల మందితో..



జిల్లాలో ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులందరి ఈకేవైసీ పూర్తి చేయించాం. సుమారు 1.14 లక్షల మంది ఈకేవైసీ పూర్తి చేయడంతో పాటు 1,453 అభ్యంతరాలను పరిష్కరించాం. ఈ–క్రాప్, ఈకేవైసీతో రైతులు పండించిన పంటల విక్రయం, పంట సొమ్ముల బ్యాంకు ఖాతాల్లో జమచేయడానికి వీలుంటుంది.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, భీమవరం

క్లుప్తంగా

ఎన్నికల నియమావళిపై అవగాహన పెంచుకోండి



రాజకీయ పార్టీల ప్రతినిధులకు శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

భీమవరం (ప్రకాశం చౌక్) : రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు శనివారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రవర్తన నియమావళి పరిధిలోకి వస్తారన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉల్లంఘించరాదన్నారు. వీలైనంతవరకు ముందుగానే నామినేషన్ వేసుకునేలా అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. ఈవీఎంలు, మాక్ పోల్, ప్రొసీజర్స్, పోలింగ్ రోజు అంశాలపై పూర్తి స్పష్టతతో ఉండాలన్నారు. ఎన్నికల కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని, సోషల్ మీడియా సెల్, మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనలకు లోబడి అభ్యర్థుల ఖర్చు ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, సువిధ, సి-విజిల్ యాప్, ఐటి అప్లికేషన్స్‌పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను బలోపేతం చేశామని, సీజర్స్ నమోదు చేస్తున్నామన్నారు. ఇన్‌చార్జ్ డీఆర్వో బి.శివనారాయణ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ ఎం.చక్రపాణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు గూడూరి జగదీష్, కామన నాగేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), మరపట్ల శ్యాంబాబు, కొట్టి నరసింహమూర్తి (టీడీపీ), బి.బలరామ్ (సీపీఎం) పాల్గొన్నారు.

సర్దార్ పాపన్న గౌడ్ ఆదర్శనీయం

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- తణుకులో పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

తణుకు అర్బన్: గౌడల ఆరాధ్యదైవం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు కొమ్మాయిచెర్వు ప్రాంతంలో ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రి కారుమూరి శనివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాధారణ వ్యక్తిగా జీవనం సాగించే వ్యక్తి మొగలుల దాష్టీకాన్ని ఎదిరించి పోరాట యోధుడిగా మారి తొలి బహుజన చక్రవర్తిగా కీర్తింపబడ్డ పాపన్న గౌడ్ జీవనశైలిని నేటి తరాలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. అటువంటి మహనీయుడి విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని స్పష్టం చేశారు. ఏఎంసీ మాజీ



తణుకులో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కారుమూరి

చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు మాట్లాడుతూ కొమ్మాయిచెర్వు ప్రాంతంలో నివసించే గౌడ్ సంఘీయులు విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇప్పించాలని కోరిన వెంటనే విగ్రహాన్ని నా సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని మంత్రి మాట ఇచ్చి అమలు చేయడం అభినందనీయమన్నారు. తణుకు మండల గౌడ సంఘం అధ్యక్షులు కోట నాగేశ్వరరావు మాట్లాడుతూ మనకు మంచి చేసిన ప్రజాప్రతినిధులకు మనం అండగా నిలబడాలని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి కారుమూరిని, విగ్రహ ఏర్పాటుకు సహకరించిన సుబ్బారావులను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరమల్లు పణీంద్రకుమార్, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, తణుకు మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, గౌడ సంఘం అధ్యక్షులు నార్గన సత్యనారాయణ, నాయకులు కామన మునిస్వామి, వెలగన శ్రీనివాసు, మైనంపాము, కొండేటి శ్రీనివాస్, కోట స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు రాజకీయ దివ్యాంగుడు'

పాలకొల్లు అర్బన్: టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ దివ్యాంగుడని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. గతంలో ఎన్నికల్లో వామపక్ష పార్టీలతో, కాంగ్రెస్, జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకుని గెలిచారే తప్ప ఒంటరిగా ఎప్పుడూ చంద్రబాబు గెలవలేదని దుయ్యబట్టారు. పాలకొల్లులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ ఉగ్రవాది అని, రాష్ట్రాన్ని, దేశాన్ని సర్వనాశనం చేశారని, తన గురువైన అద్వానీని రాజకీయంగా వంచన చేశారని తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన చంద్రబాబు.. అదే వ్యక్తితో పొత్తు పెట్టుకోవడం దారుణమన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ గతంలో ప్రధాని మోదీపై ఘోరమైన విమర్శలు చేశారని గుర్తు చేశారు. 2019 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. రానున్న



చీకటిమిల్లి మంగరాజు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు

ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన కార్యాలయాలు శాశ్వతంగా మూతపడటం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ నేత అమిత్‌షా తిరుపతి వస్తే అతనిపై కోడిగుడ్లు వేయించిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. ఎంపీ రఘురామకృష్ణంరాజు పరిస్థితి గేటు కీపర్ మాదిరిగా తయారైందన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ సీట్ల పంపకం ద్వారా అసమ్మతివాదులు పెరిగి ఒకరికొకరు వెన్నుపోట్లు పొడుచుకుని ఓడించుకోవడం ఖాయమని మంగరాజు జోస్యం చెప్పారు. జీవీ ప్రసాద్, పి.బాలకృష్ణ, బి.సునీల్‌బాబు, చిట్టిరాజు పాల్గొన్నారు.

విదేశీ మద్యం స్వాధీనం

భీమవరం అర్బన్: విదేశీ మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వై.సత్య కిషోర్ చెప్పారు. భీమవరం శివారు లోసరిలో చెక్‌పోస్టు వద్ద ఎస్సై జి.రాజు సిబ్బందితో కలిసి శనివారం వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో బైక్‌పై దువ్వకు చెందిన అడ్డగర్ల ఉదయ్‌కిరణ్, కవిటంకు చెందిన కేతా పద్మదుర్గారావు వెళుతున్నారు. వీరిని తనిఖీ చేయగా, 9 విదేశీ మద్యం బాటిళ్లు ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

పేకాటపై దాడి..

రూ.26.98 లక్షల నగదు స్వాధీనం

పెనుమంట్ర: నెలమూరు శివారులోని ఓ పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 20 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.26.98 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.రవీంద్రబాబు శనివారం చెప్పారు. పెనుగొండ సీఐ ఎస్ రజనికుమార్, స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి దాడి చేశామన్నారు.

క్లుప్తంగా


భారీ అన్నసమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

తాడేపల్లిగూడెం అర్బన్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని 16వవార్డులోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనకు పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా హాజరై స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపరమాత్మకు విశేష పూజలు



కృష్ణపరమాత్మకు విశేష పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాశివరాత్రి సందర్భంగా స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో కృష్ణపరమాత్మకు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పంచామృతాలతో, వివిధ రకాల ఫలరసాలతో సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఇందుకూరి మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఇరగవరంలో ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్ల పట్టాలు అందజేయడం చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శనివారం మండలంలోని ఇరగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ, అయితంపూడి- ఏలేటిపాడు గ్రామంలో రూ.3కోట్లతో నిర్మిస్తున్న ప్రధాన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, కంతేరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ కరోనా సమయంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని, పచ్చనేతలు, పచ్చమీడియాకు మాత్రం ఇవేమీ కనిపించడం లేదని, కేవలం ప్రభుత్వంపై విషం చిమ్మడమే ఏకైక అజెండాగా అవి పని చేస్తున్నాయని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికలు పెత్తందార్లకు, పేదలకు మధ్య జరిగే యుద్ధమని ఈ పోరులో పేదలంతా జగనన్నకు అండగా నిలవాలని కోరారు. జగనన్న మన కోసం 123 సార్లు బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందించారని, దానికి ప్రతిఫలంగా వచ్చే ఎన్నికల్లో మీరు రెండు సార్లు బటన్ నొక్కి వైఎస్సార్ సీపీకి ఓట్లు వేయాలని పిలుపు నిచ్చారు. జగనన్నపై పోటీకి టీడీపీ చంద్రబాబు, జనసేన పవన్ కల్యాణ్, కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు ఏకమవుతున్నాయన్నారు. వీరికి తోడుగా ఎల్లో మీడియా ఉన్నా వీరెవరికీ భయపడేది లేదని నా వెనుక అక్కచెల్లెమ్మలు ఉన్నారని ముఖ్యమంత్రి జగన్ చెబుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం చేసిన మంచిని గుర్తు పెట్టుకుని ఓటు వేయాలని మంత్రి కారుమూరి కోరారు. ఇరగవరం మండలంలోని 50ఎకరాలు భూ సేకరణ చేసి మహిళలకు భూ రిజిస్ట్రేషన్ పట్టాలు అందిస్తున్నామన్నారు. మళ్లీ చంద్రబాబు మాటలను నమ్మితే మళ్లీ జన్మభూమి కమిటీల దోపిడీలు మొదలవుతాయన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, కెనల్ రోడ్లు పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వెలగల సాయిబాబా రెడ్డి, జెసిఎస్ దినేష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి, ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, కొవ్వూరి శ్రీనివాస్ రెడ్డి బాబు, చోడు జోషి ,చోడే ఏసురత్నం, ఇరగవరం , కె ఇల్లిందపర్రు, ఏలేటిపాడు సొసైటీ అధ్యక్షులు చవ్వాకుల శ్రీనివాస్, మల్లిరెడ్డి నాగార్జున, సత్తిబాబు, సర్పంచ్‌లు కంకిపాటి శ్రీనివాస్, ఉప్పలూరి లావణ్య, గుడాల లక్ష్మీ శ్రీనివాస్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోట్ల సురేష్, గుడిమెట్ల ఆది లక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, చేబ్రోలు పెద్దిరాజు, కిరణ్మయి, వీఆర్‌వోలు, కార్యదర్శులు అధికారులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రథమ సంవత్సరం లెక్కల పేపర్ 1-బి, జువ్వాలజీ, హిస్టరీ పరీక్షలు శనివారం తాడేపల్లిగూడెం 5 సెంటర్‌ల్లో ప్రగతి, జీఎంఆర్, ఆదిత్య, వాసవి, గోయంకా ఉమన్స్ కళాశాలలో నిర్వహించారు. పరీక్షలకు 1,824 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,778 మంది పరీక్షలకు హాజరయ్యారు.

వేణుగోపాల స్వామి ఆలయ మండపానికి శంకుస్థాపన



దువ్వలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మండపానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేణుగోపాల స్వామి, సీతారామస్వామి వారి దేవాలయాల వద్ద రూ.75లక్షలతో నిర్మించిన ముఖ మండపానికి శనివారం రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు కృష్ణంరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గోపాల కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్‌లు, ట్రస్టీ సభ్యులు, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి నిత్య పూజలు



తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిత్య పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని బలుసులమ్మ ఆలయ ప్రాంగణంలో హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామికి నిత్య పూజలు శనివారం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మంత్రి కొట్టు తనయుడు కొట్టు విశాల్ దపంతులు, శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయ కమిటి చైర్మన్ కొట్టు అంజిబాబు దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు భారీగా పాల్గొని తరించారు. పూజల అనంతరం శ్రీవారి తీర్థ, ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

బ్యూటీషియన్ కోర్సులో ధ్రువపత్రాల అందజేత



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న త్రిపుల్ ఎఫ్ సిబ్బంది

పెంటపాడు: ప్రత్తిపాడు త్రిపుల్ ఎఫ్ కర్మాగారంలో రామేశ్వర్ బాలకృష్ణ గోయంకా ట్రస్టు, ఎలైట్ ఎడ్యుకేషనల్ సంస్థల సహకారంతో 35మంది బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు శనివారం ధ్రువపత్రాలు అందజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిపుల్ ఎఫ్ అధినేత ఓంప్రకాస్ గోయంకా, సీమా గోయంకా, జనార్ధన్, జీఎం వేమల శ్రీనివాసరెడ్డి, కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, సీఎస్ఆర్ సహాయమేనేజర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



వీరంపాలెంలో విశ్వేశ్వరస్వామికి పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ ఆధ్యాత్మిక పీఠంలో శనివారంతో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా మహాపూర్ణాహుతి, దీక్ష విరమణ, స్వామి వారికి లక్ష బిల్వార్చన, శివ పార్వతుల శాంతి కల్యాణం ఇత్యాధి పూజా కార్యక్రమాలను కర్రి రామకృష్ణారెడ్డి - స్వర్ణప్రద దంపతులు నిర్వహించారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం జరిగింది. తదుపరి భక్తులకు రుద్రాక్షలను పంపిణీ చేశారు. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళవెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో మూడ్రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

నన్నయ్య యూనివర్సిటీలో సీనియర్లకు వీడ్కోలు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్ ప్రాంగణంలో శనివారం తృతీయ సంవత్సరం బిఫార్మసీ విద్యార్థులు తమ సీనియర్లకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎకెఎన్యు క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్ హాజరై మాట్లాడుతూ నాల్గోవ సంవత్సరం విద్యార్థులు తమ జీవితంలో కొత్త అధ్యాయాలను ప్రారంభించాలని శుభాకాంక్షలు చెప్పారు. విశ్వ విద్యాలయంలో తమ సమయాన్ని అనుభవాలను ప్రతిబింబిస్తూ, మధురమైన జ్ఞాపకాలు, కథలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కోర్సు కో ఆర్డినేటర్ లిఖిత, డాక్టర్ హీరా బట్టు, డాక్టర్ సురేంద్ర, నిత్యానంద్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

31 లోగా లైఫ్ సర్టిఫికెట్స్ దాఖలు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ పెన్షనర్లు ఈ నెల 31వ తేదీ లోపు జీవన ప్రమాణాలు (లైఫ్ సర్టిఫికెట్స్) దాఖలు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్ కోరారు. అసోసియేషన్ భవనంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ సర్టిఫికెట్స్ దాఖలు కోసం ఈ నెల 31 వరకు గడువు పెంచారని తెలిపారు. 150 మంది పెన్షనర్లు జీవన ప్రమాణాల పత్రాలు దాఖలు చేసుకోవాల్సి ఉందన్నారు. వై.వి.సత్యనారాయణ మూర్తి, దాసం నాగేశ్వరరావు, వీకే వీరావు, కె.బాలకృష్ణ, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, ఎస్.ప్రభావతి, ఎల్.సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచిన వ్యక్తి కోడి రామ్మూర్తి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో కోడి రామ్మూర్తి నాయుడు విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ కీర్తి ప్రతిష్టలు పెంచిన వ్యక్తి మల్లయోధుడు కోడి రామ్మూర్తి నాయుడు అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వంగవీటి మోహనరంగా వీధిలోని వైఎస్సార్ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన కోడి రామ్మూర్తి నాయుడు విగ్రహాన్ని శనివారం మంత్రి కారుమూరి ప్రారంభించారు. మహా బలశాలిగా రామ్మూర్తి నాయుడు తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచిన వ్యక్తి అన్నారు. తణుకులో దండిమార్చ్ విగ్రహాలు మొదలుకొని స్వాతంత్ర్య సమరయోధులు, దేశ నాయకులు, పలు రంగాల్లో కీర్తింపబడిన వ్యక్తుల జీవితాలు చిన్నారులకు స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశ్యంతో వారి విగ్రహాలు పెట్టించినట్లు స్పష్టం చేశారు. నేటి బాలలకు దేశ నాయకులు చేసిన కృషిని తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రామ్మూర్తి నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, డీజే అమూల్యారావు, సామంతుల అప్పారావు, డోలా సింహాద్రి, గెద్దాడ శ్రీకాంత్, సంగిరెడ్డి శ్రీనివాస్, పైబోయిన ఏసుబాబు, ఎస్వీ జాకబ్ బాబు, కొమ్మోజు రామకృష్ణ, గంజి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'చెప్పాడంటే చేస్తాడంతే' కార్యక్రమంపై అవగాహన



అత్తిలి సచివాలయంలో బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మండల పార్టీ నాయకులు

అత్తిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ లబ్ధి పొందిన ప్రతి కుటుంబాన్ని గృహసారథులు , బూత్ కన్వీనర్లు సందర్శించి 'చెప్పాడంటే చేస్తాడంతే' కార్యక్రమం బ్రోచర్‌లను అందజేశారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. శనివారం అత్తిలి, పాలి, కె సముద్రపుగట్టు గ్రామ సచివాలయాల్లో బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో చెప్పాడంటే చేస్తాడంతే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అందరూ సమన్వయంతో పనిచేసి, ప్రతి కుటుంబానికి దగ్గరకావాలన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జేసీఎస్ మండల కన్వీనర్ పెన్మెత్స రామరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మండల బూత్ కన్వీనర్ల అధ్యక్షుడు గారపాటి నాగరాజు, మండల సేవాదళ్ అధ్యక్షుడు కంకటాల సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పైడిపర్రులో పౌష్టికాహారంపై అవగాహన



తణుకు: పైడిపర్రులో బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సుపర్ వైజర్ అరుణకుమారి



అత్తిలి: ఆరవల్లిలో పౌష్టికాహార పక్షోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, తదితరులు

తణుకు: పోషకాహార పక్షోత్సవాలను పురస్కరించుకుని తణుకు ప్రాజెక్టు పరిధిలోని తణుకు సెక్టార్ పైడిపర్రు గ్రామంలో శనివారం పౌష్టికాహారం విశిష్టతపై అవగాహన కల్పించారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు పౌష్టికాహారం, ప్రీ స్కూలు విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాలు ప్రారంభం

అత్తిలి: ప్రతి తల్లి తనబిడ్డకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ మంచిలి సెక్టార్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార పక్షోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం భుజించడం వల్ల పిల్లల్లో మేధోశక్తి శక్తి, చురుకుదనం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, సంధి విజయ, వీఎల్ఎం కుమారి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వేల్పూరులో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న గృహ సారథులు

తణుకు టౌన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గ ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలకు వివరించి, ఇంకా పథకాలు అందని వారిని గుర్తించేందుకు తణుకు మండలం వేల్పూరు గ్రామంలో బూత్ కన్వీనర్లు, గృహ సారథులు శనివారం సాయంత్రం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు చంద్రు సుశీల, విజయ దుర్గ, సుజాత, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు కత్తుల జస్పాల్, బూత్ స్థాయి కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సుబ్బారావుపేట ఐదో వార్డు అంగన్‌వాడీ సెంటర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం వార్డులో ర్యాలీ నిర్వహించారు. మహిళలను గౌరవించాలి, రక్షించాలని అంటూ నినాదాలు చేశారు. మహిళలకు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ సమాన అవకాశాలు కల్పించాలని అప్పుడే మహిళలు అన్ని రంగాల్లోను రాణించగల్గుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, వీరమ్మ, రత్నకుమారి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.